క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

విజయనగరం టౌన్: కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆయల హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించినట్లు ఆలయ ఈఓ పద్మావతి తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్తీకమాసం, సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవాల తర్వాత హుండీ ఆదాయం లెక్కించగా.. లక్షా 727 రూపాయల ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ప్రకాశ ఆలయ ఈఓ జగదీశ్వరి, అర్చకులు సోమశేఖర్ శర్మ, కమిటీ సభ్యులు, సేవకులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన క్రెడాయ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



సీఎంతో క్రెడాయ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్

విజయనగరం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును జిల్లాకు చెందిన క్రెడాయ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటూరి సుభాష్ చంద్రబోస్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం తరఫున తోడ్పాటునందించాలని కోరారు. నిర్మాణ రంగంలో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని విజ్ఞప్తిచేశారు.

లక్ష్యాల సాధనకు కృషి

- ఎంపీడీఓ రామకృష్ణరాజు

నెల్లిమర్ల: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ రామకృష్ణరాజు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా ప్రతి ఒక్క లక్ష్యాన్ని చేరుకోవడానికి అవసరమైన ప్రణాళికలు ప్రతి గ్రామ పంచాయతీలో రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శంకర్‌జగన్నాథం, ఏఓ సుదర్శనం, ఎంఈఓ యుఎస్ఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ ఉత్పత్తులు వినియోగిస్తే చర్యలు

నెల్లిమర్ల: నగర పంచాయతీలో ఎవరైనా ప్లాస్టిక్, పాలిథిన్ ఉత్పత్తులను విక్రయించినా, వినియోగించినా చర్యలు తప్పవని కమిషనర్ కె. అప్పలరాజు హెచ్చరించారు. ఐదో వార్డు సచివాలయం పరిధిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమాభాస్కర్, సచివాలయం కార్యదర్శులతో కలిసి గురువారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలిథిన్ కిరాణా, టిఫిన్ దుకాణాల నుంచి ఐదు కిలోల పాలిథిన్ కవర్లు, గ్లాసులు స్వాధీనం చేసుకుని, యజమానులకు అపరాధ రుసుం విధించారు.

రైతులకు గిట్టుబాటు ధర..

విజయనగరం రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాతే రైతులకు మేలు జరుగుతోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. గురువారం స్థానిక అశోక్‌బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ ప్రభుత్వంలోనే రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాకు నగదు జమవుతోందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి క్రీడలకు ఏర్పాట్లు

నెల్లిమర్ల: పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు పాఠశాల ప్రాంగణంలోని క్రీడా మైదానంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ అంబళ్ల ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం పిచ్చిమొక్కలు, తుప్పలు తొలగించారు. ఈ నెల 26, 27 తేదీల్లో క్రీడా పోటీలు జరుగుతాయన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం

- తహసీల్దార్ తాడ్డి గోవింద

పూసపాటిరేగ: రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ తాడ్డి గోవింద అన్నారు. మండలంలోని వెంపడాంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మ్యుటేషన్లు, డీ పట్టా మంజూరు, తదితర సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్వేయర్ గణపతిరావు, సర్పంచ్ పిన్నింటి కుమార్, ప్రజాప్రతినిధులు పిన్నింటి వెంకటరమణ, కొరటాన ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

హామీలిచ్చారు.. అమలు మరిచారు

- ఆరు నెలల పాలనలో కానరాని అభివృద్ధి
- ప్రజా సమస్యలపై పట్టించుకోని విజయనగరం ఎమ్మెల్యే అదితిగజపతిరాజు
- మాన్సాస్ ఆస్తుల పరిరక్షణకే ప్రాధాన్యం





గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేసిన అచెంటా గార్డెన్స్‌కు పసుపు రంగు వేసిన దృశ్యం

విజయనగరం: ఎన్నికల సమయంలో ఎన్నో హామీలిచ్చారు.. తమను గెలిపిస్తే స్థానిక సమస్యలను పరిష్కరిస్తామంటూ ఊదరగొట్టారు.. వారి మాటలను నమ్మి గెలిపించిన ప్రజలకు మాత్రం మొండిచేయి చూపించారు.. ఇదీ కూటమి నాయకుల తీరు.. విజయనగరం నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఉంది. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంటింటికీ కుళాయిలు వేస్తాం.. పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీటి ట్యాంక్‌లను నిర్మిస్తాం.. గడిగెడ్డ జలాశయ నీటి సామర్థ్యం పెంచేందుకు శాశ్వత ప్రాతిపదికన పనులు చేపడతాం.. విజయనగరం వాటర్ స్కీమ్ పనులు పూర్తి చేస్తాం.. ఇలాంటి ఎన్నో హామీలు ప్రస్తుత విజయనగరం నియోజకవర్గ ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు ఇచ్చారు. తీరా ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఒక్క హామీ కూడా నెరవేర్చిన దాఖాలాలు లేవు. దీంతో ప్రజలు కూటమి పాలనపై మండిపడుతున్నారు.

ఆరు నెలల్లో చేసిందేమిటి..?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తోంది. అయితే ఇప్పటివరకు ఒక్క హామీ కూడా నెరవేర్చిన దాఖలాలు లేవు. ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు మొదటి వంద రోజులు అధికారిక సమీక్షల్లో హడావిడి చేశారు. ప్రస్తుతం ఆమె తన వ్యక్తిగత కార్యాలయానికే పరిమితమవుతూ అక్కడి నుంచి నియోజకవర్గ స్థాయి అధికారులతో కథ నడిపిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎన్నికల్లో కష్టపడి పని చేసిన క్యాడర్‌ను కూడా పట్టించుకోవడం లేదన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు. తన వ్యక్తిగత పీఏ అంతా తానై పాలన వ్యవహారాలు చూస్తుండగా.... కేవలం క్షత్రియ సామాజికవర్గానికి చెందిన వారికే ప్రాధాన్యతం ఇస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పార్టీలో ఏళ్ల తరబడి ఉంటున్న నాయకులకు తగిన గౌరవం ఇవ్వడం లేదన్న విమర్శలు మూటగట్టుకున్నారు. అంతేకాకుండా తన తండ్రి కేంద్ర మాజీమంత్రి పూసపాటిఅశోక్‌గజపతిరాజు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న మాన్సాస్ ట్రస్ట్‌కు సంబంధించిన ఆస్తుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించడం గమనార్హం. ఇప్పటికే పలు భవనాలను అధికార యంత్రాంగం సహకారంతో తొలగించే చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేసిన అచంటా గార్డెన్స్‌కు రంగులు మార్చడం మినహా కొత్త అభివృద్ధి పనులు ముందుకు కొనసాగించడం లేకపోతున్నారు. నగరంలోని ప్రధానమైన అంబటిసత్రం – కొత్తపేట నీళ్ల ట్యాంక్ రోడ్డు విస్తరణ పనులు గత ప్రభుత్వ హయాంలో 60 శాతం పైగా పూర్తి చేయగా... మిగులు పనులు కూడా పూర్తి చేయలేకపోయారు.



ప్రారంభానికి నోచుకోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం

అదితి గజపతిరాజు చేసిన హామీల్లో కొన్ని ప్రధానమైనవి..

- విజయనగరం అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేస్తాం.
- నగరం నడిబొడ్డున ఉన్న మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను పూర్తి చేస్తాం.
- ద్వారపూడి వద్ద ఏర్పాటు చేసిన సోలార్ పవర్‌ప్లాంట్‌ను పునరుద్ధరిస్తాం.
- పూర్తయిన కంటోన్మెంట్ రైల్వే అండర్‌పాస్ లైన్‌ను ప్రారంభిస్తాం.
- విజ్జి స్టేడియంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను పూర్తి చేస్తాం.
- మూతపడిన క్రీడా పాఠశాలను అందుబాటులోకి తీసుకువస్తాం.
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అండగా నిలుస్తాం. ఆయా వర్గాల వారికి 50 ఏళ్లకే పింఛన్లు మంజూరు చేస్తాం.
- రూ. 5 వేల కోట్లతో ఆదరణ పథకాన్ని పునరుద్ధరిస్తాం.

అన్నదాతకు ఏదీ భరోసా



చౌడువాడలో సాగులో ఉన్న మొక్కజొన్న

- అందని వ్యవసాయ పరికరాలు
- విత్తనాలు, ఎరువులకూ తప్పని ఇబ్బందులు

నెల్లిమర్ల నియోజకవర్గంలో ప్రధాన పంటలు		
మండలం	ఖరీఫ్‌లో వేసిన పంటలు	విస్తీర్ణం
పూసపాటిరేగ	వరి, మొక్కజొన్న, వేరువనగ	3856 ఎకరాలు
భోగాపురం	వరి, మొక్కజొన్న, అపరాలు	1250 ఎకరాలు
డెంకాడ	వరి, మొక్కజొన్న, అపరాలు	3200 ఎకరాలు
నెల్లిమర్ల	వరి, మొక్కజొన్న	3760 ఎకరాలు

పూసపాటిరేగ: అన్నదాతలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ పూర్తయి రబీ సీజన్ ప్రారంభమవుతున్నా అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం 20 వేల రూపాయలు అందలేదు. కనీసం అ ఊసే ఎత్తడం లేదు. ప్రతి ఏటా వ్యవసాయశాఖ ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు రాయితీపై టార్పాలిన్లు, స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజన్లు ఇచ్చేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుభరోసా పథకం ఏడాదికి రూ. 13,500 ఆర్థిక సాయం అందేది. ఏడాదిలో మూడుసార్లు రైతు బ్యాంక్ ఖాతాకు నగదు జమయ్యేది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రైతులకు ఏడాదికి రూ. 20 వేల చొప్పున అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు అన్నదాతకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా మోసం చేయడం విశేషం. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం నిధులు విడుదల చేస్తున్నా, కూటమి ప్రభుత్వం తనవంతు నిధులు ఎందుకు విడుదల చేయడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు.

బయట కొనుగోలు చేశాం..

రాష్ట్ర ప్రభుత్వం స్ప్రేయర్లు, టార్పాలిన్లు, ఆయిల్ ఇంజిన్లు రాయితీపై సరఫరా చేయడం లేదు. దీంతో ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నాం. రైతులకు పంట కాలంలో ఉపయోగపడే స్ప్రేయర్లు అయినా సరే కనీసం 50 శాతం రాయితీతో సరఫరా చేయాలి.

జి. శ్రీనివాసరావు, రైతు, పూసపాటిరేగ

రైతులను ఆదుకోవాలి

ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇస్తామన్న హామీలను నెరవేర్చాలి. రబీ సీజన్‌కు అయినా పెట్టుబడి సాయం చేసి అందజేసి రైతులను ఆదుకోవాలి.

పి. రామనర్సి, రైతు, పూసపాటిరేగ.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- అదనపు ఎస్పీ సౌమ్యలత



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

విజయనగరం క్రైమ్: విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అదనపు ఎస్పీ పి.సౌమ్యలత సూచించారు. పోలీస్ సంక్షేమ ఆంగ్ల పాఠశాల ఆవరణలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల దంత, కంటి, ఇతర వైద్య సమస్యలను పరిష్కరించడానికి ఇటువంటి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, రోటరీ అధ్యక్షుడు వినోద్‌కుమార్, కార్యదర్శి నాగప్రసాద్, సభ్యులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధిపథంలో నడిపించాలి

- గ్రామీణాభివృద్ధి రాష్ట్ర పరిశీలకుడు సుబ్బారావు



మాట్లాడుతున్న గ్రామీణాభివృద్ధి రాష్ట్ర పరిశీలకుడు సుబ్బారావు

పూసపాటిరేగ: పంచాయతీలను అభివృద్ధిపథంలో నడిపించాలని గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర పరిశీలకుడు ఇ. సుబ్బారావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, డిజిటల్ అసిస్టెంట్లు, వీఏఓలకు నిర్వహిస్తున్న శిక్షణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. ఖర్చు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాధిక, ఈఓపీఆర్‌డీ జ్ఞానేశ్వరరావు, రిసోర్సుపర్సన్లు పాల్గొన్నారు.

16 నుంచి అన్నదాత దివస్ వారోత్సవాలు

- ఎస్‌బీఐ అగ్రికల్చర్ డీజీఎం హేమ

విజయనగరం అర్బన్: అంతర్జాతీయ రైతు దినోత్సవాన్ని (ఈ నెల 23న) పురస్కరించుకుని ఈ నెల 16 నుంచి 23వ తేదీ వరకు అన్నదాత ఫెస్టివ్ వారోత్సవాలను ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎస్‌బీఐ అగ్రికల్ విభాగం అమరావతి సర్కిల్ డీజీఎం హేమ ప్రకటించారు. పట్టణంలోని ఎస్‌బీఐ ట్రైనింగ్ కళాశాల ప్రాంగణంలో వారోత్సవాల నిర్వహణపై రైతులకు గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన వారోత్సవాల షెడ్యూల్‌ను ఎస్‌బీఐ జాతీయ స్థాయిలో నిర్వహించనుందని తెలిపారు. అనంతరం పలువురు రైతులకు రూ.65 లక్షల వరకు రుణాలు మంజూరు చేశారు. విజయనగరం, డెంకాడ, గంట్యాడ, గజపతినగరం, తదితర ప్రాంతాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

17న గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న చిరంజీవి

విజయనగరం ఫోర్ట్: ఈ నెల 17న స్థానిక రామనారాయణం దగ్గరలో జొన్నవలస రోడ్డులో ఉన్న మామిడి తోటలో గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు గ్రామీణ వైద్యుల సంఘ జిల్లా అధ్యక్షుడు గద్దె చిరంజీవి తెలిపారు. గురువారం స్థానిక పీఎస్సార్ కాంప్లెక్స్ గ్రామీణ వైద్యుల సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న గ్రామీణ వైద్యులంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు కోట్ల పైడిరాజు, మక్కువ రమణ, కర్రి సత్యనారాయణ, భవానీ దివాకర్, సీతారామ్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి తగదు..



గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

విజయనగరం అర్బన్: హైదరాబాద్‌లో సినీనటుడు మోహన్‌బాబు, తిరుపతిలో మోహన్‌బాబు సహాయకులు జర్నలిస్టులపై చేసిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ, వివిధ జర్నలిస్టుల సంఘాలు ఖండించాయి. ఈ మేరకు గురువారం స్థానిక కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట జర్నలిస్టులు నిరసన చేపట్టారు. గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందచేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మంచు కుటుంబంలో జరుగుతున్న వ్యవహారాలను కవరేజ్ చేస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పీఎస్‌వీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు అల్లు సూరిబాబు, ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఎన్ రాజు, బీజేఆర్ పాత్రో, భరత్, డేవిడ్‌రాజు, జైరాజ్, ఎల్రక్టాన్ మీడియా సీనియర్ జర్నలిస్టులు అల్లు యుగంధర్, కోటేశ్వరరావు, జగన్నాథ వెంకట్, బూరాడ శ్రీనివాసరావు, వివిధ సంఘాల ప్రతినిధులు సింహాచలం, సూరిబాబు, సత్యనారాయణ, ఫోటో జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

సతివాడలో రెవెన్యూ సదస్సు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ సుదర్శనరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు భూ సంబంధిత సమస్యలపై వినతులు సమర్పించారు. తహసీల్దార్ సుదర్శనరావు మాట్లాడుతూ, భూ సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అనుమతుల్లేని నిర్మాణాల అడ్డగింత

విజయనగరం: నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న భవన నిర్మాణ పనులను అధికారులు అడ్డుకున్నారు. కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, తదితరులు నగరంలో గురువారం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా వేణుగోపాలపురంలోని లేఅవుట్‌ను తనిఖీ చేశారు. అలాగే కేఎల్‌పురంలో నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించి, అనుమతులు లేని కారణంలో గోడలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. భవన నిర్మాణాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరన్నారు. కార్యక్రమంలో టీపీఓ అప్పలరాజు, టీపీఎస్ అనిత, ప్రణాళిక సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ: విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో మండలంలోని అక్కివరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరా ఉండదని విజయనగరం ఆపరేషన్ ఈఈ జి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అక్కివరం, బంటుపల్లి, పేడాడ, రాజులతమ్మాపురం, గొలగాం, గంట్లాం, బెల్లాం, చినఅమకాం, అమకాం గ్రామాలకు పూర్తిగాను.. డి.తాళ్లవలస, టి.కళ్లాలు గ్రామలకు కొంతభాగం సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సారిపల్లి రూరల్ ఫీడర్ పరిధిలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి రూరల్ ఫీడర్ పరిధిలో ఎల్‌సీ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ పి. త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. సారిపల్లి, నీలంరాజుపేట, కుదిపి గ్రామాలతో పాటు పోలీస్ ట్రైనింగ్ కళాశాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

● ఆకస్మిక తనిఖీ..



విజయనగరంలోని 17వ నంబర్ సచివాలయాన్ని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది సమయానికి హాజరవుతున్నదీ, లేనిదీ ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యతాంశాల అమలులో కార్యదర్శులు కీలకపాత్ర పోషించాలన్నారు. – విజయనగరం

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



భగవద్గీత పారాయణం చేస్తున్న మహిళలు

విజయనగరం టౌన్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, తద్వారా ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తారని పట్టణానికి చెందిన ప్రముఖ ధార్మికవేత్త పెంటపాటి ముత్యాలు అన్నారు. ఆధ్యాత్మిక జ్ఞానజ్యోతి భక్తమండలి, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సామూహిక గీతా పారాయణం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భావితరాలకు గీతాపారాయణం నేర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పంచముఖ ఆలయ కమిటీ ఆర్గనైజర్ పెంటపాటి కామరాజు, ఆధ్యాత్మికవేత్త కట్టమూరి పోతన్నశెట్టి, ఎంవీ చలం, మండవిల్లి వెంకటరాజు, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనం

- ప్రకృతి వ్యవసాయం రీజనల్ కోఆర్డినేటర్ ప్రకాష్



పంటను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయం రీజనల్ కోఆర్డినేటర్ ప్రకాష్

డెంకాడ: ప్రకృతి వ్యవసాయంతో పంటకు, పర్యావరణానికి కూడా ప్రయోజనం కలుగుతుందని ప్రకృతి వ్యవసాయం రీజనల్ కోఆర్డినేటర్ ప్రకాష్ అన్నారు. మండలంలోని అమకాంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురుగు నివారణా మందులు, భూసారం పెంపొందించుకునేందుకు వినియోగించే ఎరువులను రైతులే నేరుగా తయారు చేసుకోవచ్చన్నారు. ఒకేసారి బహుళ పంటలను సాగు చేయడం ద్వారా రైతులకు మంచి ఆదాయం వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దిండి కోటి, ఎస్ఎఫ్ఏ మెరిసి, మెంటార్ గౌరి, రైతులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

విజయనగరం ఫోర్ట్: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకు ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రధాన కేంద్రం, డివిజన్ కేంద్రాలలో విద్యుత్ పొదుపు అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు.. స్వయం సహాయక సంఘాల మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటెడ్ గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

17వ డివిజన్‌లో వార్డు పర్యటన



వార్డు పర్యటనలో పాల్గొన్న అసిస్టెంట్ కమిషనర్, స్థానిక కార్పొరేటర్, కో ఆప్షన్ సభ్యులు

విజయనగరం: నగరంలోని 17వ డివిజన్‌లో కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, తదితరులు గురువారం వార్డు పర్యటన చేపట్టారు. 20వ నంబర్ సచివాలయం నుంచి ప్రారంభమైన వార్డు పర్యటనలో ప్రజలతో మాట్లాడుతూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక కార్పొరేటర్ ఆశపు సుజాత, కోఆప్షన్ సభ్యుడు ఆశపు వేణు, తదితరులు పాల్గొని అధికారుల దృష్టికి పలు సమస్యలు తీసుకువచ్చారు. పుత్సలవీధిలో కాలువ పరిశుభ్రంగా లేదని స్థానికులు చెప్పగా.. వెంటనే మురుగు తొలగించాలని పారిశుధ్య పర్యవేక్షకుడు బాలకృష్ణను ఆదేశించారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు మాట్లాడుతూ.. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు సీతారామమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.